నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శుక్రవారం | 12 జులై 2024 పేజీలు 8

## కర్నూల్ రేంజ్ డీఐజీగా కోయ ప్రవీణ్

**కర్నూల్ క్రైమ్ మెజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది డిఐజీలను బదిలీ చేస్తూ అందులో గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్న కోయ ప్రవీణ్ ను కర్నూల్ రేంజ్ డిఐజిగా గురువారం బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ పరిధిలో భాగంగా రాష్ట్ర డిజిపి నీరబ్ కుమార్ ప్రసాద్ డిఐజిల బదిలీలను విడుదల చేశారు. కర్నూల్ రేంజ్ డీఐజీగా పనిచేస్తున్న సిహెచ్ విజయరావును రాష్ట్ర డిజిపి కార్యాలయానికి బదిలీ చేయగా కోయ ప్రవీణ్‌ను కర్నూలు రేంజ్ డిఐజిగా బదిలీ చేశారు .కోయ ప్రవీణ్ 2009 ఐపీఎస్ బ్యాచ్కు చెందిన వారు. ఈయన వివిధ విభాగాల్లో పనిచేస్తూ ప్రస్తుతం గ్రేహౌండ్స్ డిఐజిగా విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా కోయ ప్రవీణ్ ఐపీఎస్ కర్నూల్ రేంజ్ డిఐజిగా బదిలీ అయ్యారు.



కర్నూలు నూతన రేంజ్ డిఐజిగా బదిలీ అయిన కోయ ప్రవీణ్




## ఉపాధి హామీలో
# వెనుకంజలో కర్నూలు

**కర్నూలు ,మేజర్‌న్యూస్ బ్యూరో :**

వలసలకు పెట్టింది పేరైన కర్నూలు జిల్లా ఉపాధి హామీ పథకం అమలులో బాగా వెనుకబడి ఉంది. కుటుంబానికి సగటున ఉపాధి కల్పనలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో 25వ స్థానానికి పరిమితమైంది. పని దినాల కల్పనలో 99శాతంతో 15వ స్థానంలో నిలిచింది. ఆలూరు,పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల పరిధిలో వందల గ్రామాల ప్రజలు చేసేందుకు పని దొరకక పొట్ట చేత పట్టుకుని పిల్లాపాపలను, వృద్ధులను వదిలేసి వలస వెళ్లడం ప్రతి ఏటా చూస్తూనే ఉన్నాం. గ్రామాలకు గ్రామాలు ఖాళీ చేసి సుగ్గి పేరుతో హైదరాబాద్, బెంగళూరు,గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వలసెల్లిపోతుంటాయి వేలాది కుటుంబాలు. మంచినీటి వనరులు అంతంత మాత్రంగానే ఉండడంతో పాడిపశువులను కబేళాలకు తరలించి వలసలు పోవడం ఈ ప్రాంతంలో నిత్యకృత్యం. ఇలాంటి దుర్భరపరిస్థితులున్న కర్నూలు జిల్లా ఉపాధి హామీ పథకం అమలులో వెనుకబడి ఉండడమేమిటన్నది అర్థం కాని ప్రశ్నగా మారింది. ప్రజలు ముందుకు రావడం లేదా? మిగతా 2లో

- 99 శాతం పని దినాలే కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం
- వలసలకు కేంద్రంగా ఉన్న జిల్లాలో ఈ పరిస్థితి పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కలెక్టర్
- ఇన్ యాక్టివ్‌గా ఉన్న 1.50 లక్షల జాబ్ కార్డులు
- కృష్ణాజిల్లా,మన్యం జిల్లాలతో పొలిస్తే బాగా వెనుకబడ్డ కర్నూలు జిల్లా
- ప్రజలకు ఎలాంటి పనులు అవసరమో గుర్తించాలన్న కలెక్టర్

# కుందూ పై మట్టి మాఫియా పంజా



సూర్య వార్తాకథనం

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** జీవనదిగా పేరొందిన కుముద్వినిపై మట్టి మాఫియా పంజా విసిరింది. కుందూలోని మట్టి, ఇసుక తరలింపుకు అక్రమార్కులు భారీ వ్యూహాన్ని రచించారు. అక్రమ సంపాదనే లక్ష్యంగా కుందూపై అక్రమార్కుల డేగ కన్ను పడింది. కుందూనది నుంచి మట్టి, ఇసుకను తరలించేందుకు నలుదిక్కులా రహదారుల ఏర్పాటు జరిగిపోయింది. ఒక చోట రహదారి ఏర్పాటుపై వివాదం రగులుకోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. భారీ ప్రొక్లైన్ కుందూలో మొహరించింది. అధికార పార్టీలకు కుందూ మిగతా 2లో

- రోడ్డు ఏర్పాటు పై వివాదం-నిలిచిపోయిన నిర్మాణం
- అక్రమ సంపాదనకు అక్రమార్కుల భారీ వ్యూహం
- మట్టి తరలింపుకు నలుదిక్కుల రహదారుల ఏర్పాటు
- మొహరించిన భారీ ప్రొక్లైన్
- కుందూనది మట్టి-ఇసుక పై అక్రమార్కుల డేగ కన్ను
- అధికార పార్టీలకు ఆదాయ వనరుగా కుందూ పరివాహం
- ఎన్నికల ముందు అక్రమ త్రవ్వకాల పై ఫరూక్ ఘాటైన వ్యాఖ్యలు
- ప్రస్తుతం ప్రతిపక్షాలకు ఆయుధంగా అక్రమ త్రవ్వకాలు


కుందూనదిలో ప్రొక్లైన్

# బాలిక బంధువుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట బాలిక బంధువులు ధర్నా చేస్తున్న దృశ్యం

**నందికొట్కూరు మేజర్ న్యూస్ :** నందికొట్కూరు పోలీస్ స్టేషన్ ఎదుట కేజీ రోడ్డుపై బైఠాయించి బాలిక బంధువులు ధర్నా చేసారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ధర్నా విరమించేది లేదని బిస్మిచుకొని కూర్చున్నారు. సంఘటన జరిగి ఐదురోజులైనా ఇంతవరకు బాలిక ఆచూకీ తెలియకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మైనర్లను విచారించేందుకు వీలుకాకపోతే వారి పెద్దలను పిలిపించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర,జాతీయ విపత్తు నిర్వహణ బృందాలు గాలింపు చేపట్టిన మృత దేహం లభ్యం కాలేదంటే దీనిని మేము మిగతా 2లో

### తక్కువ ధరలకే కందిపప్పు,బియ్యం
## పంపిణీకి శ్రీకారం



6లో
కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

### సరసమైన ధరలకు
## నిత్యావసర సరుకులు


6లో
పట్టణంలోని పద్మావతినగర్ రైతుబజార్‌లో నాణ్యమైన బియ్యంను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

# ఉపాధి హామీలో వెనుకంజలో కర్నూలు

(మొదటి పేజి తరువాయి)

పనులు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోందా? అన్నది తేలాల్చి ఉంది. మూడు పంటలు పండించే కృష్ణాజిల్లాలో 193శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 164 శాతం పనులు కల్పిస్తుంటే ఖచ్చితంగా అవసరం ఉన్న కర్నూలు జిల్లాలో 99శాతం మేర పనులు కల్పించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మరింత ఆశ్చర్యం కలిగించే పరిణమామేమిటంటే జిల్లాలో 1,50,000 జాబ్ కార్డుదారు లు ఉపాధి పనులకు రావడం లేదన్నది గురువారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఉపాధి హామీ పథకంపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో వెల్లడైంది. 1.50లక్షల కార్డులు ఇన్‌యాక్టివ్ ఎందుకున్నాయ న్నది సమీక్ష సందర్భంగా సంబంధిత అధికారులు నోరు విప్పక పోవడాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ ఎందుకు ఈ పరిస్థితి తలెత్తిం దన్నది తీలుసుకుని నివేదిక సమర్పించాలంటూ డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. ప్రతి ఏటా సుగ్గి పేరుతో వలస వెళ్లడాన్ని ఆపేందుకు ఎప్పటి నుండో ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్లు కనిపిస్తున్నా అవేవీ ఫలితాన్నివ్వడం లేదు. వలసలపై అధ్యయనం చేసి, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను గుర్తించేందుకు ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ కమిటిని గతప్రభుత్వం ఏర్పాటు చేసినా ఐదేళ్లు కనీస చర్యలకు కూడానోచుకోకపోవడం ఈ ప్రాంత ప్రజల దౌర్భాగ్యం.



కలెక్టర్ రంజిత్ బాషా

**వలసల నివారణపై దృష్టి పెట్టండి : కలెక్టర్ రంజిత్ బాషా :** గురువారం నాటి సమీక్షలో కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ వలసల నివారణపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల ప్రజల అవసరాలను గుర్తించి ఎలాంటి పనులు కల్పిస్తే రైతులకు, రైతు కూలీలకు లబ్ది చేకూరుతుందో గుర్తించాలని ఆయన సూచించారు.వలసల నివారణకు తీసుకోవలసిన చర్యలపై అధ్యయనం అవసరమని ఆయన అన్నారు. ఏపీడీలు గ్రామాలకు వెళ్లి సర్వేలు చేసి వలసలు వెళితే ఎంత మేర ఆర్జిస్తారో సర్వే చేసి ఆ మేరకు ఇక్కడ పనుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వలసలు వెళ్లే ప్రతి మండలానికి ఒక ఇంఛార్జ్‌ను నియమించాలని ఆయన సంబంధింత అధికారులను ఆదేశించారు.

# కుందూపై మట్టి మాఫియా పంజా

(మొదటి పేజి తరువాయి)



కుందూనదిలో ప్రొక్లైన్

ఆదాయ వనరుగా మారిపోయింది. ఎన్నికలకు ముందు కుందూ అక్రమ త్రవ్వకాలపై అప్పటి టీడీపీ ఇన్‌ఛార్జి ఫరూక్ ఘాటైన వ్యాఖ్యల తో అధికార పార్టీ వైసీపీపై విరుచుక పడ్డారు. ప్రస్తుతం ప్రతిపక్ష వైసీపీకి అక్రమ త్రవ్వకాలు ఆయుధంగా మారనున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది. నంద్యాల శివారులోని కుందూ నదిలో మట్టి, ఇసుకకు మంచి గిరాకి ఉంది. ఇసుకను ఇంటి నిర్మాణాలకు వినియో గిస్తారు. మట్టిని పొలాలతోపాటు ఇసుక బట్టీలకు ఉపయోగిస్తారు. అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీ కనుసన్నల్లో కుందూలో అక్రమ త్రవ్వకాలు యద్దేచ్ఛగా సాగుతాయి. ఇప్పటి వరకు ఎన్నో సంవత్సరాలు అధికారంలో ఉన్నా శిల్పా వర్గీయుల చేతుల్లోనే అక్రమ త్రవ్వకాలు సాగుతున్నాయని అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం నేతలు ఎన్నో సార్లు ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో అధికార మార్పు అక్రమ త్రవ్వకాల పై ప్రభావాన్ని చూపాయి. శిల్పా వర్గీయులు అక్రమ త్రవ్వకాలను నిలిపి వేశారు. ఇదే సమయంలో అక్రమార్కులు కొందరు ఒక బృందంగా ఏర్పడి కుందూనదిపై డేగ కన్ను వేశారు. కుందూనదిలోని మట్టి, ఇసుకకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో అక్రమార్కు లు కుందూనదిపై పంజా విసిరేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. కుందూనది పరివాహక ప్రాంతాలలో నలువైపుల నుంచి ఇసుక, మట్టిని తరలించేందుకు భారీ వ్యూహాన్ని రచించారు. నాలుగు వైపుల రహదారుల నిర్మాణాన్ని చేపట్టారు. ఒక వైపు రహదారి నిర్మాణంపై భూ యజమానితో వివాదం తలెత్తడంతో ఆ వైపు రహదారి నిర్మాణాన్ని నిలిపి వేశారు. ప్రస్తుతం కుందూనదిలో భారీ ప్రొక్లైన్‌ను ఏర్పాటు చేశారు. గత కొద్దిరోజుల నుంచి అడపదడప వర్షాలు పడుతుండటం తో ఆ ప్రాంతంలో భూమి తడిగా ఉండటంతో అక్రమార్కులు పలు మార్గాలపై అన్వేషణ చేస్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పటి అధికార పార్టీ కనుసన్నల్లో అక్రమ త్రవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించిన అప్పటి టీడీపీ ఇన్‌చార్జి ఫరూక్ ఆ ప్రాంతాన్ని సందర్శించి అధికార వైసీపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో సూర్య దినపత్రిక అక్రమ త్రవ్వకాలపై వార్తాకథనాన్ని అందించింది. ఎన్నికల సమయం కావడంతో అధికారులు అక్రమ త్రవ్వకాలపై నిషేదం విధించారు. ఇప్పుడు అక్రమార్కుల కన్ను కుందూనదిపై పడింది. విలువైన ఖనిజ సంపదను తరలించేందుకు అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన తృతీయ శ్రేణి నాయకులు తెర వెనుక ఉండి భారీ వ్యూహాన్ని రచించినట్లుగా తెలుస్తోంది. రహదారుల ఏర్పాటు నాలుగు వైపులపూర్తి కావడంతోపాటు వాతావరణం అనుకూలిస్తే అక్రమ త్రవ్వకాలకు వినియోగించే ప్రొక్లైన్ బకెట్ గునపం కుందూపై పడనుంది. మట్టిని ఖాళీ స్థలాల ఎత్తును పెంచుకునేందుకు, ఇంటి నిర్మాణంలో భాగంగా పూడికల కోసం వినియోగిస్తారు. ఇసుకను ప్రధా నంగా నిర్మాణాలకు భారీగా వినియోగిస్తారు. ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్ల తో తరలించేందుకు సిద్ధం అవుతున్నారు. మరి అక్రమ త్రవ్వకాలపై అధికార పార్టీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

**అక్రమ త్రవ్వకాలు జరిపితే కఠిన చర్యలు – తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి :** కందూనదిలో అక్రమ త్రవ్వకాలు జరిపి తే కఠిన చర్యలు తప్పవు. కుందూలో భారీ వాహనాలు ఉన్నట్లు సమాచారం అందడంతో వీఆర్వోను అక్కడికి పంపాము. అక్కడ ఉన్న ప్రొక్లైన్‌ను సీజ్ చేశాం. ప్రొక్లైన్‌కు ఎలాంటి నెంబర్ లేదు. గుర్తు తెలియని వ్యక్తులు మూడు రోజుల నుంచి కుందూలో రహదారులు ఏర్పాటు చేసినట్లు గుర్తించాం. అక్రమ త్రవ్వకాలు జరిపితే కేసులకు వెనుకాడం.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

**18 తులాల బంగారు రికవరీ**

**కర్నూల్ క్రైమ్ మేజర్ న్యూస్ :** నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు ఇండ్లలో చోరీచేసిన అంతరాష్ట్ర దొంగ సత్యనారాయణ అతనికి సహకరించిన రవికుమార్లను నాలుగో పట్టణ సీఐ శంకరయ్య అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సొమ్ము రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకెళ్తే పలనాడు జిల్లా పిడుగురాళ్ల చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి 36 కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడని నగరంలోని గోపి నగర్ బృందావన నగర్‌లో రెండు నెలల దొంగతనానికి పాల్పడ్డ కేసులో అరెస్ట్ చేసి అతని వద్ద నుండి 9:30 తులాల బంగారు ఆభరణాలను ఎనిమిదిన్నర తులాల ముత్తూట్ ఫైనాన్స్లో పెట్టిన బంగారు చీటీని రికవరీ చేసుకొని ఈరోజు కోర్టులో హాజరు పరచగా సత్యనారాయణ రవికుమార్ లను జడ్జి రిమాండ్కు తరలించారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న నాలుగో పట్టణ సీఐ శంకరయ్య ఎస్ఐ మోహన్ కిషోర్ కుమార్ రెడ్డిని క్రైమ్ పార్టీ పోలీసులు ఆర్కే నాయక్ శాకీర్లను కర్నూల్ డిఎస్పి విజయ శేఖర్ అభినందించారు. గురువారం దొంగలతో పాటు సొమ్ము రికవర్ని చూపారు. ఈ కార్యక్రమంలో నాలుగో పట్టణ పోలీసులు ఎస్సై మోహన్ కిషోర్ కుమార్ రెడ్డి ఏఎస్ఐ రామునయ్య ఫ్రైమ్ పార్టీ పోలీసులు ఉన్నారు.



రికవరి అయిన సొమ్మును,పట్టుకున్న దొంగను చూపుతున్న పోలీసులు

## తక్కువ ధరలకే కందిపప్పు, బియ్యం పంపిణీకి శ్రీకారం

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** జిల్లాలో సరసమైన ధరలకు నాణ్యమైన కందిపప్పు, బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తెలిపారు. గురువారం స్థానిక సీక్యాంపు సెంటర్‌లోని రైతు బజారులో ప్రత్యేక కౌంటర్‌ను జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.181లు ఉన్న కందిపప్పును రూ.160లకు, రూ.55లు ఉన్న బియ్యాన్ని రూ.49లకు అందజేస్తున్నామని తెలిపారు. నగరంలోని 9ప్రాంతాల్లో కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, డీఎస్ఓ కెవిఎస్ఎం శేషిరెడ్డి, మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఏఎస్ఓ రామాంజనేయులు, ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్ పాల్గొన్నారు.

## సరసమైన ధరలకు నిత్యావసర సరుకులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతు బజార్‌లలో సోనామసూరి బియ్యం, కందిపప్పు ధాన్యాలను సరసమైన ధరలకు వినియోగదారులకు విక్రయిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. గురువారం పద్మావతినగర్‌లోని రైతుబజారు, టెక్కె మార్కెట్ యార్డులోని రైతు బజారులలో నంద్యాల జిల్లా హోల్‌సేల్ మండి మర్చంట్ అసోసియేషన్ సౌజన్యంతో నాణ్యమైన కందిపప్పు, కర్నూలు సోనా మసూరి బియ్యాన్ని సరసమైన ధరలకు విక్రయించే ప్రత్యేక కౌంటర్లను జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల నిత్యావసర వస్తువులు అధికంగా ఉన్న నేపథ్యంలో రైతు బజారులో ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించి బియ్యం, కందిపప్పులను అందించాలని నిర్ణయిం చిందన్నారు. ఈమేరకు దే శవాలి రకం కందిపప్పు కిలో రూ.160లు, స్టీమ్డ్ సోనామసూరి బియ్యం కిలో రూ.49, సోనా మసూరి రా బియ్యం రూ.48లు చొప్పున వినియోగదారులకు విక్రయిస్తున్నామన్నారు. రైతు బజార్‌లోని కౌంటర్లలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు వినియోగదారుల సౌకర్యం విక్రయిస్తామన్నారు. నంద్యాలలో రెండు కేంద్రాలలో, ఆత్మకూరు, డోన్, ఆళ్ళగడ్డ పట్టణాలలోని రైతు బజార్‌లలో కూడా ప్రత్యేక కౌంటర్లు ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక కేజీ కందిపప్పు, 5కేజీల బియ్యం కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పించామన్నారు. జిల్లాలోని వినియోగదారులందరూ తమ ఆధార్‌కార్డుతో పాటు క్యారీ బ్యాగ్ తీసుకుని కౌంటర్లలో నిత్యావసర సరుకులు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్ర మంలో డిఎస్ఓ వెంకటరాముడు, కమిషనర్ నిరంజన్‌రెడ్డి,ఆర్డీవోమల్లికార్జున్‌రెడ్డి, పాల్గొన్నారు.

# బాలిక బంధువుల ఆందోళన

(మొదటి పేజి తరువాయి)

ఏవిదంగా అర్థం చేసుకోవాలని అన్నారు. పోలీసులు విచారణ చెయ్యడంలో విఫలం ఐనందుకే మేము రోడ్ ఎక్కవలిసి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేసారు. పెద్ద పెద్ద అధికారు లు వస్తున్నారు పోతున్నారు కానీ బాలిక గురించి వివరాలు వెల్లడించడం లేదని వాపోయారు. రోజులు గడుస్తున్నాయి కానీ మృతదేహం ఆచూకీ తేల్చడం లేదని ఆందోళన చేపట్టామన్నారు. అడిషనల్ ఎస్పీ పోలీస్ స్టేషన్లోకి వారిని పిలిపించుకొని రెండు రోజులలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తాత్కాలికంగా ధర్నా విరమించారు. రెండు రోజులలో సమస్య పరిష్కారం కాకపోతే రెండు తెలుగు రాష్ట్రాల ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## రైతు కుటుంబానికి అండగా భానుముక్కల సహకార సంఘం

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలోని భానుముక్కల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు బనగానపల్లె కె.డి.సి.సి బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీమతి ప్రియాంక చేతులమీదుగా ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతు భార్య వొడిసెల లక్ష్మీ ప్రస న్నకు రెండు లక్షల రూపాయల ఇన్సురె న్స్ క్లైయిమ్ చెక్కును అందజేశారు. సొసైటీ సి.ఈ.వొ అబ్దుల్ మునాఫ్ మాట్లా డుతూ మిట్టపల్లె గ్రామానికి చెందిన వొడిసెల బ్రహ్మానంద రెడ్డి అనే రైతు బైక్ ప్రమాదంలో మృతి చెందడంతో సంఘం తరపున ఇన్సురెన్స్ క్లైయిమ్ అందివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కె.డి.సి.సి బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శత్రుఘ్నుడు, సొసైటీ సి..ఈ.వొ అబ్దుల్ మునాఫ్, సామిర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న దృశ్యం

# పి.ఎం కిసాన్‌కు అర్హత నిబంధనలు

**– మండల వ్యవసాయ అధికారిని కె. సునీత**

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః**

సాగు భూమిని (వ్యవసాయ వినియోగానికి మాత్రమే) కలిగి ఉన్న ఏ రైతు అయిన పి.ఎం కిసాన్‌కు అర్హులని మండల వ్యవసాయ అధికారిని కె. సునీత తెలిపారు. ఈ సందర్భంగా పి.ఎం కిసాన్‌కు అనర్హత నిబంధనల గురించి వివరించారు. ఒక మరణం భూమి వారసత్వ విషయంలో తప్ప 01.02.2019తరువాత వ్యవసాయ భూమి కలిగి ఉన్న ఏ రైతు అయినా అనర్హులని ఆమె తెలిపారు. 01.02.2019 తరువాత వ్యవసాయ భూమి అమ్మడం కానీ , విభజించడం కానీ , బహుమతిగా (దానం)గా బదిలీ చేసినట్లయితే బదిలీదారుడు అనర్హులవుతారని బదిలీదారుడు తన పేరు మీద ఉన్న భూమిని ఇతరులకు బదిలీ చేయడం ద్వార బదిలీదారుని వద్ద ఎటువంటి వ్యవసాయ భూమి లేకపోతే అనర్హులవుతారని ఆమె తెలిపారు. అలాగే ఇప్పటికే పి.ఎం కిసాన్ ప్రయోజనాన్ని పొందుతున్న కుటుంబ సభ్యుడు ఉన్నట్లయితే అదే కుటుంబంలోని సభ్యుడు అర్హులు కలిగినా అనర్హులవుతారని ఆమె తెలిపారు. వ్యవసాయ భూమిని విక్రయించడం వల్ల భూమి లేని రైతు కూడా అనర్హుడవుతాడని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. సునీత, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలో ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 8ఏళ్ల చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను తక్షణమే పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వాల్మీకి యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాంపల్లి సూరన్న కోరారు. గురువారం తుగ్గలిలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మైనర్‌బాలిక పార్కులో ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ వ్యక్తులు పాపకు మాయమాటలు చెప్పి ఎత్తుకెళ్లి అత్యాచారం చేసి హత్య చేసి కాలువలో పడేయడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు చాలా బాధకరమన్నారు. వెంటనే నిందితులను అత్యంత కఠినంగా శిక్షించాలన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న రాంపల్లి సూరన్న

# బాధితురాలికి రక్షణ కల్పించాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** మాజీ ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ లైంగిక వేధింపులకు గురైన బాలిక కుటుంబానకిఇ రక్షణ కల్పించాలని రజక వృత్తిదారుల సంఘం, ఐద్వా ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు గురుశేఖర్, శేషాద్రి, రాముడు, శ్రీనివాసులు, జయమ్మ, ఎల్లయ్య, శేఖర్‌బాబు, రమణ, మద్దిలేటి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఇంట్లో పనిచేసిన బాలికను లైంగికంగా వేధించారన్నారు. బాలిక అని చూడకుండా సుధాక్ లైంగికంగా లొంగదీసుకునేందుకు అనేక చిత్రహింసలకు గురిచేశారన్నారు. ఈ విషయాన్ని బయటపడిన బాలికకు మాజీ ఎమ్మెల్యే నుంచి ప్రాణహాని ఉందని, బాలికకు, ఆమె కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. అదే విధంగా బాధితురాలికి ఉపాధి కల్పించాలని కోరారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న శ్రీరాములు

# ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఇన్‌ఛార్జీ ఛైర్మెన్‌ను తొలగించాలి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జ్ ఛైర్మన్‌ను వెంటనే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఏపీఎన్‌ఎఫ్ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ వైస్‌ఛైర్మన్, అసిస్టెంట్ స్పెషలాఫీసర్లను తొలగించాలన్నారు. హేమచంద్రారెడ్డి చేసిన అవినీతిపై విచారణ ఆదేశించిన గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఇన్‌చార్జి వైస్‌ఛైర్మన్ అవినీతిపై విచారణ చేసి శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌ఎఫ్ నాయకులు నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఎంపీలో నగర కమిషనర్ భేటీ

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ గురువారం నగర పాలక కార్యాలయంలో తొలిసారి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీకి కమిషనర్ పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నగరాభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. నగరానికి సంబంధించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ పేర్కొన్నారు. అనంతరం నగరంలో చేపట్టిన అభివృద్ధి , సమస్యలపై ఎంపీ, కమిషనర్ చర్చించారు.


ఎంపీ నాగరాజుకు పూలబొకే అందజేస్తున్న కమిషనర్

# నివాళులర్పించిన కర్నూలు ఎంపీ

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** అనారోగ్యంతో మృతిచెందిన కోడుమూరు టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తల్లి రత్నమ్మ భౌతికకాయాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సందర్శించారు. విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో రత్నమ్మ పార్థివదేహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డిని పరామర్శించారు. రత్నమ్మ మృతికి కారణమైన అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


నివాళులర్పిస్తున్న దృశ్యం

## ప్రభుత్వ పథకాల కోసం

# ప్రైవేటు వ్యక్తులను నమ్మకండి

## – మత్స్యశాఖ అధికారిని శ్యామల



**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ పథకాల కోసం ప్రైవేటు వ్యక్తులన నమ్మవద్దని కర్నూలు జిల్లా మత్స్యశాఖ అధికారిణి శ్యామల సూచించారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఆమె విలేఖరులతో మాట్లాడారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు మత్స్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రజల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారన్నారు. దీనికి సంబంధించి ప్రజలు, మత్స్యకారులు నేరుగా నగరంలోని కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. ప్రైవేటు వ్యక్తులకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. దీనిని ప్రజలు గమనించాలన్నారు.

# 14న పూర్వపు విద్యార్థుల సమ్మేళనం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** పెండేకల్లు రైల్వేస్టేషన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14వతేదీన 2000 నుంచి 2005వ సంవత్సరంలో 6నుంచి 10తరగతి పూర్తి చేసిన విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. ఈ సమ్మేళనంలో చదువు నేర్పిన గురువులను సన్మానించడం జరుగుతుందన్నారు.

# విద్యార్థులు ప్రతిరోజు చేతులు శుభ్రం చేసుకోవాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి మహమ్మద్ బేగ్

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్:** వర్షాకాలం కావడంతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని విద్యార్థులు ప్రతిరోజు భోజనం చేసే సమయంలో చేతులను శుభ్రపరచుకోవాలని వైద్యాధికారి మహమ్మద్ బేగ్ తెలిపారు. గురువారం స్థానిక కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులకు మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు శుభ్రమైన దుస్తులను ధరించాలన్నారు. ఏ చిన్నపాటి అనారోగ్యం కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వ్యాధులు రాకుండా చేపట్టాల్సిన విషయాలను తెలియజేశారు. పాఠశాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పీహెచ్‌ఓ బాలకృష్ణ, సూపర్‌వైజర్ గుర్రప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## కడ్లేమాగిలో అనుమానాస్పదంగా

# రెండు గుడిసెలు దగ్ధం

## ★ భారీగా సంభవించిన ఆస్తి నష్టం

**హొళగుంద, మేజర్‌న్యూస్:** హొళగుంద మేజర్ పంచాయితీ పరధిలోని మజర గ్రామమైన కడ్లేమాగిలో రెండు పూరీ గుడిసెలు గురవారం అనుమానాస్పదంగా దగ్ధం అయ్యాయని ఐఆర్‌ఐ దినోజ్‌కుమార్,విఆర్‌ఓ నాగరాజు తెలిపారు.గుడిసెలో ఎవరు లేని సమయంలో గుడిసెలకు నిప్పు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయాయన్నారు.కట్టుబట్టలతో బాధితులు వీధిన పడ్డారన్నారు.హిరేత్తనవర మల్లయ్యకు చెందిన గుడిసెలో రూ. 5 లక్షల నగదుతో పాటు నాలుగు తులాల బంగారం,25 తులాల వెండి,ఇంటి పత్రాలు,పోలాల పట్టాదారు పాసుపుస్తాకాలు,వంట సామాగ్రి,ఆహర ధాన్యాలు,బట్టలు అగ్నిలో కాలి బూడిదైయ్యాయన్నారు.పక్కనే ఉన్న ముసానపల్లె శంకరప్పకు చెందిన గుడిసెకు కూడా నిప్పు అంటుకోవడంతో శంకరప్పకు చెందిన గుడిసెలో 50 వేల రూపాయల నగదు,బట్టలు,వంట సామాగ్రి,2 సంచుల బియ్యం,ఆరు సంచుల కందులు,సజ్జ,నాలుగు సంచుల మిరప,ఆవాలు అగ్ని ఆహుతి అయినట్లు బాధితులు చెప్పిన మేరకు వారు వివరించారు.కట్టుబట్టలతో వీధిన పడిన బాధితులు సర్వం కోల్పోయి రోడ్డుపై రోధించారు.ఇద్దరి బాధుతులకు సంభంది భారీగా ఆస్త నష్టం జరగింది.ఆలూరు అగ్నిమాపక దళం సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు.అగ్ని ప్రమాదం ఎలా సంభవించిందని విషయం తెలియరాలేదు.జరిగిన ప్రమాదంపై బాధితుల చెప్పిన మేరకు పోలీసులు కేసునునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.సర్వం కోల్పోయి వీధిన పడిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అగ్ని ఆహుతికి సర్వం కోల్పోయినట్లు చెబుతున్న బాధితుడు


పూర్తిగా కాలిపోయిన గుడిసెలో దీనంగా కూర్చున్న మహిళ

# దైవ దర్శనానికి వెళ్లి వస్తూ ...

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్:** నంద్యాల పట్టణంలోని నందమూరి నగర్ ప్రాంతానికి చెందిన సీతారామ్ సింగ్ (53) అనే ఆటో డ్రైవర్ గురువారం సాయంత్రం పట్టణ శివారులోని అయ్యలూరు మెట్టవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. గురువారం ఉదయం సీతారామ్ సింగ్ తన భార్యతో పాటు పక్కింటివారితో అహోబిళంకు దైవ దర్శనానికి వెళ్లారు. దర్శనం పూర్తి చేసుకొని అక్కడే మధ్యాహ్నం భోజనం ముగించుకొని నంద్యాలకు బయలుదేరారు. పట్టణ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతివేగంగా ఆటోను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత అధికంగా ఉండడంతో సీతారామ్ సింగ్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. సీతారామ్ సింగ్ భార్యతో పాటు ఆటోలో ఉన్నవారికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి గాయపడిన వారిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


సీతారామ్ సింగ్

# కుమారుని చేతిలో తల్లి దారుణ హత్య



**పాణ్యం, మేజర్ న్యూస్:** మండలంలోని ఒడ్డుగండ్ల గ్రామంలో మతిస్థిమితం సరిగా లేని కుమారుని చేతిలో తల్లి దారుణ హత్యకు గురైంది. వివరాల్లోకి వెళితే నిందితుడు అంగజాల మహేష్ (36) గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక తాగుడుకు బానిసై కన్నతల్లి అయిన అంగజాల నాగలక్ష్మమ్మ (58) కు రోకలి కర్రతో తలపై బాధలంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందినది. విషయం తెలుసుకున్న పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్సై అశోక్, సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త అంగజాల గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తల్లిగారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు

సూర్య





నివాళులర్పిస్తున్న టీజీ వెంకటేష్

## నివాళులర్పించిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్‌రెడ్డి మాతృమూర్తి రత్నమ్మ గురువారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ విష్ణువర్ధన్‌రెడ్డి స్వగృహానికి రత్నమ్మ పార్థీవ దేహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## నారాలోకేష్‌ను కలిసిన జిల్లా టీడీపీ అధ్యక్షుడు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరులు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌ను కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్‌లు గురువారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారాలోకేష్ దృష్టికి పలు విషయాలను తీసుకెళ్లారు. ఎన్నికల సార్వత్రిక అనంతరం వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే అనుచరులు టీడీపీకి చెందిన గిరినాథ్‌చౌదరిని అత్యంత కిరాతకంగా హత్య చేశారని, వారి కుటుంబానికి ప్రాణహాని ఉందని తెలిపారు. సుబ్బరాయుడుకు ప్రభుత్వం తగిన పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. నారాలోకేష్ స్పందిస్తూ మీ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఏనాడూ హత్య రాజకీయాలకు ప్రోత్సహించదన్నారు.



మంత్రి నారాలోకేష్‌తో తిక్కారెడ్డి, కేఈ శ్యామ్‌కుమార్

## కొత్తూరు సుబ్బరాయునికి స్కంద పంచమి, షష్టి పూజలు



**పాణ్యం , మేజర్‌న్యూస్ :** ప్రముఖ శైవ క్షేత్రము, పాణ్యం మండలం, ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆషాడ మాసం స్కంద పంచమి, షష్టి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణస్వామి, సురేష్ శర్మ, రోహిత్ శర్మ లు, ఆలయ సిబ్బంది, భక్తులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఇష్ట ప్రీతి ష్ పాత్రమైన స్కంద, పంచమి, షష్టిని పురస్కరించుకొని ప్రాంతం కాల పూజలు, అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. పలు ప్రాంతంలో నుండి భక్తులు హాజరై స్వామివారికి భక్తి శ్రద్ధల పంచమి, షష్టి పూజలు నిర్వహించుకున్నారు.

## చంద్రన్న బీమాను సద్వినియోగం చేసుకోండి

**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** చంద్రన్న బీమాను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి మేకల నాగరాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం మార్చి 16 నుండి జూన్ 30 వరకు జరిగిన క్లైమ్‌ల పరిష్కరం కొరకు ప్రభుత్వం చంద్రన్న బీమా వెబ్ సైట్ ప్రారంభించిందని కావున WEA, WWDS వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. డెత్ సర్టిఫికెట్, నామిని ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకొని సంబంధిత సచివాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

## మాజీ సర్పంచ్ మృతికి నివాళులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని శకునాల గ్రామం మాజీ సర్పంచ్ శివమ్మ మృతికి నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ గౌరు వెంకట్ రెడ్డి గురువారం నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి కుటుంబానికి అండగా ఉంటామని ఆమె మృతి బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి టిడిపి నాయకులు మురళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి



మాత్రలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కర్నూలు లీగల్, మేజర్‌న్యూస్:** బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి వెంకటశేషాద్రి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో వైద్యశిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాలికలు రక్తహీతకు గురికాకుండా ఉండేందుకు ఆకుకూరలను అధికంగా తీసుకోవాలన్నారు. హాస్టలో విద్యార్థినిలకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. డాక్టర్ ఫర్హాన్ బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం జ్వరం, జలుబు, దగ్గు, రక్తహీనత, అనీమియా, ఐరన్‌లోపం ఉన్నవారికి మాత్రలు పంపిణీ చేశారు. లీలాసాయి, సుభాస్, సాయిశ్రీవల్లి, ఈశ్వరవెంకటప్రసాద్ పాల్గొన్నారు.

## కర్నూలు ఎంపీని కలిసిన మొలగవల్లి టీడీపీ నాయకులు

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా ఎంపి పంచలింగాల నాగరాజును ఆలూరు మండలం మొలగవల్లి టిడిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రాంనాథ్‌యాదవ్, మండల కన్వీనర్ అశోక్ యాదవ్,మాజీ ఎంపిటిసి లు అంజినయ్య, గోపాల్,మాజీ సర్పంచ్ రంగస్వామిలు కలిసి పూలమాలతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ మొలగవల్లి నుండి హెూసూరు కు అసంపూర్తిగా మిగిలిపోయిన తారు రోడ్డును పూర్తి చేయాలని,అలాగే మొలగవల్లి,నేమకల్లు రోడ్డును పూర్తి చేయాలని కోరారు.గ్రామంలో తాగునీటి సమస్య ఉందని కొత్త ట్యాంక్ లను మంజూరు చేయాలని,పార్లమెంటు నిధులతో బిసి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వారు కోరారు. అలాగే మొలగవల్లి గ్రామానికి రావాలని వారు ఎంపీని ఆహ్వానించారు. దానికి ఎంపి స్పందిస్తూ ఎన్నికల సమయంలో అన్ని గ్రామాలు తిరగలేకపోయామని నన్ను ఆదరించి ఓట్లు వేసి గెలిపించిన జిల్లా ప్రజలకు రుణపడి ఉంటానని త్వరలో ఆలూరు మండలంలో పర్యటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యంకన్న, కంది శీనప్ప, వార్డు మెంబర్ ఐకాంత్, శ్రీరామ్ జయరాం, వెంకటేష్ లు పాల్గొన్నారు.



ఎంపి పంచలింగాల నాగరాజు ను పూలమాలతో సన్మానం చేస్తున్న మొలగవల్లి టీడీపీ నాయకులు

### అంగన్వాడి పాఠశాల పరిసర ప్రాంతాలు

## పరిశుభ్రంగా ఉండాలి : ఎంపీడీవో



**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** అంగన్వాడి పాఠశాలల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని ఎంపీడీవో డి మల్లీశ్వరి అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్వాడి సూపర్వైజర్లు కార్యకర్తలు మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్వాడీ లకు సంబంధించిన సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలో విద్యార్థులకు భోజనం రుచిగా అందిస్తూ చక్కని విద్యను అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అర్థమయ్యేలా చెప్పి పిల్లలను అంగన్వాడి పాఠశాలలకు పంపేలా చూడాలని తెలియజేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్లాంట్ ఫర్ మదర్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని త్వరలో ప్రారంభించబోతున్నారని అందుకు అందరం సిద్ధంగా ఉండాలని సూచనలు చేశారు. ఏవైనా విద్యార్థులకు సమస్యలు ఉంటే అంగన్వాడి టీచర్ ఆయాలతో పాటు మహిళా పోలీసులు ముఖ్య పాత్ర పోషించాలని తెలిపారు. సమస్యలు త్వరగా పరిష్కరించే విధంగా ఉంటే పంచాయతీ సెక్రటరీలు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వారికి మొక్కలు పంపిణీ చేసి అంగన్వాడి పాఠశాల పరిసర ప్రాంతాల్లో నాటాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు టీచర్లు ఆయాలు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన

## నిందితులను కఠినంగా శిక్షించాలి

### ఐ హెచ్ ఆర్ సి రాష్ట్ర అధ్యక్షురాలు,విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు డిమాండ్

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** చిన్నారి వాసంతి పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని . అంతర్జాతీయ మానవ హక్కుల రాష్ట్ర అధ్యక్షులు అనీషా పాషా ఆర్ వి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ఓర్వకల్లు బస్టాండ్ లో కొవ్వొత్తుల తో నిరసన తెలిపి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పగిడాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఐదవ తరగతి చదువుతున్న 8 సంవత్సరాల వాసంతిని అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ విద్యార్థులు ఆదివారం రోజున మాయమాటలతో వాసంతిని ఊరు బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసి హత్య చేసి మల్యాల ఎత్తిపోతల కాల్వలం మృతదేహాన్ని పడేవేశారని అంత దారుణానికి ఒడి గట్టిన ముగ్గురు నిందితులను కఠినంగా శిక్షించాలని ఎన్కౌంటర్ చేయాలని విద్యార్థినిలు అంతర్జాతీయ మానవ హక్కుల రాష్ట్ర అధ్యక్షురాలు విద్యార్థి సంఘాల నాయకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగ సురేంద్ర ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న సురేష్ విద్యార్థినిలు పాల్గొన్నారు





## 13 నుంచి రాష్ట్రస్థాయి ఈత పోటీలు



మాట్లాడుతున్న రామక్రిష్ణయాదవ్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14వతేదీల్లో రాష్ట్రస్థాయి ఈత పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి జి.రామక్రిష్ణ యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9వ సబ్‌జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటివ్ ఛాంపియన్‌షిప్‌లు పోటీలు కిసాన్‌ఘాట్ సమీపంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మొత్తం 90ఈవెంట్లో సుమారు 350బాలబాలికలు పోటీ పడుతున్నారన్నారు. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. స్విమ్మర్లకు వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఎస్ఓ భూపతిరావు పోటీల నిర్వహణకు అన్ని విధాల సహకరిస్తున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, క్రీడాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కోశాధికారి దస్తగిరి, జాయింట్ సెక్రటరీలు శివరాజ్, రామక్రిష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి హజరతయ్య, ఈసీ మెంబర్లు ఉమామహేశ్వరరావు, శివరాంపుల్లయ్య, విశ్రాంత తహసీల్దార్ మద్దిలేటి, వయోజన విద్య విశ్రాంత డీడీ రమణ, విశ్రాంత ఉద్యోగి జాన్ పాల్గొన్నారు.

ప్రజల తరపున ముఖ్యమంత్రికి

# కృతజ్ఞతలు తెలిపిన భూమా అఖిలప్రియ

## నిత్యవసర విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజా రంజక పాలన అందిస్తున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో ప్రభుత్వం సబ్సిడీతో అందించే బియ్యము కందిపప్పు విక్రయ కేంద్రాన్ని ఆమె తాసిల్దార్ అహ్మద్ హుస్సేన్, రమేష్ బాబు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకులు ప్రజలు పడే ఇబ్బందులను గమనించక తమ స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజల పరిస్థితులను ఆలోచించి నిత్యవసర వస్తువులను తక్కువ ధరకే ప్రజలకు అందించేలా శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. నెలకు ఒకసారి ప్రతి కుటుంబానికి ఒక కిలో కంది బేడలు (రూ. 160)5 కిలోల సోనా మసూరి బియ్యం (కిలో రూ. 48) చొప్పున ప్రజలకు మార్కెట్ యార్డులో అందించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిత్యవసర వస్తువులను అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. పేద,మధ్యతరగతి ప్రజలు బహిరంగ మార్కెట్ కు, ప్రభుత్వం అందించే ధరకు మధ్యన ఉన్న వ్యత్యాసాన్ని గమనించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అనంతరం మార్కెట్ యార్డ్ కార్యదర్శి నారాయణ,సిబ్బంది ఆమెను మార్కెట్ యార్డ్ తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ డి టి సోమశేఖర్ రెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వోలు రాజగోపాల్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, వెంకట నరసయ్య, వెంకటపతి, మిల్లర్లు, కౌన్సిలర్ హుస్సేన్ భాష, మాజీ జెడ్పిటిసి చాంద్ బాషా, టిడిపి నాయకులు చింతకుంట రామశేఖర్ రెడ్డి, సిద్ధం రెడ్డి జాఫర్ రెడ్డి, సోముల శేఖర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, రామాచారి, నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

# మృతిచెందిన హమాలి కుటుంబానికి యూనియన్ సహాయం

**కోడుమూరు,మేజర్ న్యూస్:** గత నెల పట్టణంలో మృతిచెందిన హమాలి కార్మికుడు రంగడు కుటుంబానికి హమాలి వర్కర్స్ యూనియన్ గురువారం ఆర్థిక సహాయం అందజేసింది. హమాలి కార్మికులు అందరూ కలిసి తమవంతుగా హమాలీ కార్మికులు రంగడు తల్లి శివమ్మకు 10 వేల రూపాయల నగదును సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బికృష్ణ, ఏఐటీయూసీ నాయకులు మధు ,హమాలీ కార్మికులు బజారి ల చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ఎన్నో సంవత్సరాలుగా హమాలి కార్మికులు ఐకమత్యంతో మృతి చెందిన కుటుంబానికి ఇలాంటి సహాయం అందిస్తున్నామన్నారు. తామందించే సహాయంతో పాటు మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రభుత్వాలు



కార్మికులకు సమగ్ర భద్రత చట్టాన్ని వెంటనే అమలు పర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్,ఏడుకొండలు, శివుడు ,సుంకన్న ,చిన్న బజారి, కృష్ణ ,మనీ, దాము ,చిన్న రాముడు,పెద్ద రాముడు తదితరులు పాల్గొన్నారు.

# కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** కౌలు కార్డులకు అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని హుస్సేనాపురం కాల్వ గ్రామాలలో వ్యవసాయ శాఖ మరియు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డుల కొరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న కౌలు రైతులు కార్డు కోసం రైతు సేవ కేంద్రాల లోని వ్యవసాయ సహాయకులను కానీ రెవెన్యూ అధికారుల్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కాల్ కార్డు వలన రైతులకు ఏ పంట నమోదు అతివృష్టి అనావృష్టి వలన కలిగే పంట నష్టం పంటల బీమా కనీసం మద్దతు ధరల కోసం అవసరమవుతుందని తెలియజేశారు కార్డు 11 నెలలు కాలపరిమితి ఉండడం వలన పట్టాదారులకు ఎటువంటి నష్టం ఉండదని తెలియజేశారు. అనంతరం రైతులకు ప్రొద్దుతిరుగుడు మినీ కిడ్స్ రకం ఎన్ డి హెచ్ 1012 హైబ్రిడ్ రకాన్ని రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్ మధు మరియు రైతులు పాల్గొన్నారు.

# మరో అరుదైన ఘనత సాధించిన జెమ్ కేర్ కామినేని హాస్పిటల్




**కర్నూలు రూరల్ మేజర్ న్యూస్ :** రాయలసీమ లోనే అత్యంత వేగంగా కేవలం మొదలు పెట్టిన 10 నెలల్లో 550 కి పైగా ప్రొసీజర్లు చేసి క్యాత్ ల్యాబ్ ప్రొసీజర్లో తిరుగులేని హాస్పిటల్ గా దూసుకెళ్తుంది అని జెమ్ కేర్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. తమ దగ్గర అత్యంత ఆధునిక ఎక్విప్మెంట్ గల క్యాత్ ల్యాబ్ 24గంటలు 7రోజులు అందుబాటులో వుండీ, ప్రత్యేకమైన టీంతో ఉంటుందని తెలిపారు. ఈ 550 ప్రొసీడర్స్ సంక్లిష్టమైన స్టెంటింగ్, చిన్న పిల్లలో సంక్లిష్టమైన వాల్ రీప్లేస్మెంట్ లు ఎన్నో జరిగాయి అని పేస్‌మేకర్స్ లో కండక్షన్ పేసింగ్ సిస్టమ్ లాంటి అత్యాధునిక ప్రొసీజర్స్, కాంప్లెక్స్ యాంజియోప్లాస్టీలో రోటబ్లేషన్, ఐవియూఎస్, బెలూన్ వాల్వులోప్లాస్టీ, హార్ట్ లో హోల్స్ కి డివైస్ క్లోజర్స్ లాంటి అరుదైన క్లిష్టమైన ప్రొసీడర్స్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ అనతి కాలంలోనే క్యాథ్ ల్యాబ్ లో 550కి పైగా ప్రొసీజర్స్ చేయడం చాలా గర్వకారణంగా ఉందని తనకు సహకరించిన తన టీంకి , హాస్పిటల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో మరెన్నో సర్జరీలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్మోహన్ రెడ్డి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గణేష్ సిఓఓ నదీమ్, జనరల్ మేనేజర్ మరియు క్యాథ్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాణ్యాం అభివృద్ధి కోసం కృషి చేస్తా

## పాణ్యాం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి – రసవత్తరంగా సర్వసభ్య సమావేశం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** పాణ్యం అభివృద్ధి కోసం కృషి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శారద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశం చాలా రసవత్తరంగా సాగంది. వైసీపీ ప్రభుత్వంలో అధికారులు చాలా తప్పులు చేశారని పలువురు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. గ్రామాల్లోని పలు సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకవచ్చారు. గ్రామాల్లో తాగునీరు, మురుగు నీటి కాలువలను శుభ్రం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ పాణ్యం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో కల్లూరు తహసీల్దార్ మునివేలు, ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఈవోఆర్డీ రవికిషోర్‌రెడ్డి, కల్లూరు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, నాయకుల్లు చంద్రారెడ్డి, మార్కాపురం గణమద్దిలేటి, నెరవాడ గోపినాథ్‌రెడ్డి, జడ్పీటీసీ మునిస్వామి, కల్లూరు మండల సర్పంచులు, జడ్పీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

# విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి



**ఓర్వకల్లు మేజర్ న్యూస్ :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యను అందించాలని ఎంపీడీవో మల్లేశ్వరి, మండల విద్యాధికారి ఓంకార్ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్లో ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులలో నైపుణ్యాన్ని వెలికి తీయాలని ఉపాధ్యాయులు 9 గంటల లోపు ఫేషియల్ యాప్ వేయాలని విద్యార్థులు హాజరు ఉదయం 9:30 గంటల లోపు వేయాలని తెలిపారు పాఠశాలల్లో ఐఎఫ్ పి ప్యానల్స్ను అన్ని పాఠశాలలో సద్వినియోగం చేసుకోవాలని ఆదేశించారు. భోజనం సమయంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అందేలా చూడాలన్నారు అదేవిధంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు సిఆర్పిలు ఎం ఐ ఎస్ డిటిపి మెసెంజర్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికను హత్య చేసిన

# నిందితులను ఉరితీయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ కుమార్
- నిందితులను కఠినంగా శిక్షించాలి : ఏపి మహిళా సమాఖ్య
- వాసంతి హత్యను ఖండిస్తు నిరసన తెలిపిన ప్రజా, విద్యార్థి సంఘాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** మైనర్ బాలిక పై మృగాళ్ళ అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను వెంటనే ఉరితీసి ఇలాంటి సంఘటనలు పునరావృతం చూస్తు ఇలాంటి సంఘటనలకు పాల్పడాలంటే వీరికి విధించే శిక్ష వణుకుపుట్టేలా ఉండాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ముర్తుజాబి, స్వాతిలు అన్నారు. గురువారం మైనర్ బాలిక వాసంతిని అత్యాచారం చేసి హత్యచేసి కాల్వలో పడివేయడం దుర్మార్గమైన చర్యా అని నిందితులను కఠినంగా శిక్షించాలంటూ ఎస్ఎఫ్ఐ, సిపిఐలతో పాటు పలు విద్యార్థి , ప్రజా సంఘాలు నిరసన తెలియాజేశారు. స్థానిక గౌడు సెంటర్‌లో బాలికలతో కలిసి నిరసన తెలియజేసి నిందితులకు విధించే శిక్ష మరోసారి ఇలాంటి సంఘటనలకు పాల్పడాలంటే వణుకుపుట్టేలా ఉండాలని అన్నారు. ఈ సంర్భంగా ఎస్ఎఫ్ఐ , ఎపి మహిళా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ మైనర్ బాలికను హత్యచేసి కాల్వలో పడవేయడం బాధాకరమని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది నాయకులు వచ్చినా ఆడపిల్లలపై అత్యాచారాలు,దాడులు ఆగడం లేదని, ఆడపిల్లగా పుట్టడమే పాపమా అనే విధంగా సమాజం తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. అభంశుభం ఎరుగని మైనర్ బాలికపై ముగ్గురు బాలుర అత్యాచారం చేసి చంపి కాల్వలో వేయడం దారుణమని , ఇలాంటి వారిని కఠినంగా శిక్షించి వెంటనే ఉరితీయాలన్నారు. ఇప్పటి వరకు కూడా వావంతి మృతదేహం దొరకపోవడం బాధాకరమని, వాసంతి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. పోలీసు ఉన్నతాధికారులు నిందితులను కఠినంగా శిక్షించి ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని కోరారు. వాసంతి హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ప్రతాప్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయిదిలీప్,లింగేష్, భరత్, రాజు, నరసింహనాయక్, ఎన్ స్వాములు, రామ్‌నాయక్, హమాలి వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి నాయకులు చాంద్‌బాషా, ఎస్‌కె చాంద్‌బాషా, ఖాదర్‌వలి, జాకీర్, అన్వర్, ముర్తుజా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గౌడ్‌సెంటర్‌లో విద్యార్థినీలతో కలిసి నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సూర్య



# 360 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఉర్దూ ఘర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కర్నూలు శాంతిరాం ఐ హాస్పిటల్ వారి సహకారంతో 360 మందికి పరీక్షలు నిర్వహించినట్లు శాంతిరాం హాస్పిటల్ డాక్టర్ నాగార్జున, మైనార్టీ నాయకులు హుసేన్ సాహెబ్, హాజీ బడేసాబ్, బందేనవాజ్ లు తెలిపారు. ఈ కంటి పరీక్షల్లో 132 మందికి కంటి ఆపరేషన్ కి అర్హులని వైద్య సిబ్బంది తెలపగా వారికి ఉచిత బస్సు ఏర్పాటు చేసి వారిని కర్నూలుకు తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. రానున్న మరిన్ని సేవా కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో నజీర్ అహ్మద్, రాళ్ళదొడ్డి రఫీక్, నూరుల్లా ఖాద్రీ, మస్తాన్ వలి, కంబలదిన్ని ఖాజా, ఇస్మాయిల్ , తదితరులు పాల్గొన్నారు.

# ఏవో పై ఎమ్మెల్యే అగ్రహం..!

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు వ్యవసాయ శాఖ అధికారి మహేశ్వర రెడ్డి పని తీరుపై ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈవో పై వచ్చిన ఫిర్యాదుల మేరకు, తనిఖీల పేరిట రైతులకు ఇబ్బంది పెట్టినట్లు, రైతులకు సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎమ్మెల్యే ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పనితీరు మార్చకపోతే సెలవుల్లో వెళ్లిపోవాలని ఎమ్మెల్యే ఆదేశించినట్లు సమాచారం. ఎమ్మెల్యే తీసుకున్న నిర్ణయంపై రైతులు, ఎరువుల దుకాణ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ శాఖ అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బీవీ

# వరల్డ్ పాపులేషన్‌డే ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బనగానపల్లె టౌన్ 19వ వార్డు బుడగ జంగాల కాలనీలో వరల్డ్ పాపులేషన్ డే ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు మాట్లాడుతూ తల్లీ బిడ్డ శ్రేయస్సు కోసం గర్భధారణ మరియు బిడ్డకు బిడ్డకు మధ్య ఎడమ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని గర్భవతులకు మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది. మహిళలు గ్రామీణ ప్రాంత కుటుంబ ప్రణాళిక ఏర్పరుచుకోవడం వల్ల తల్లీ మరియు బిడ్డ కుటుంబం ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుంది. అదే విధంగా మహిళలు తాత్కాలిక పద్ధతులు అనగా గర్భనిరోధక మాత్రలు ఐ.యు.సి.డి అంతర ఇంజెక్షన్‌లు పాటించడం ద్వార తాతాల్కిక పద్ధతుల వల్ల తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని డాక్టర్ శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈవొ వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పి రమేష్, ఎ.ఎన్.ఎం గ్రేసమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్:** నంద్యాల జిల్లాలోని హోల్‌సెల్ డీలర్లు, రిటైల్ డీలర్లు ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ఎరువు కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఎరువుల కంపెనీ ప్రతినిధులు వారి కంపెనీకి సంబంధించిన ఎరువుల రాకపోకలను వ్యవసాయాధికారులకు తప్పకుండా తెలియజేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో డీలర్లకు పంపిణీ చేసిన ఎరువుల సమాచారాన్ని 24 గంటల్లోగా తెలియజేయాలన్నారు. జిల్లాలోని ఎరువుల డీలర్లందరికీ అవసరమైన మేరకు ఎరువులు కొరత లేకుండా సరఫరా చేయాలని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో ఎరువుల వాడకం అధికంగా ఉండే ఆగష్టు, సెప్టెంబర్ మాసాలలో కంపెనీల నుండి జిల్లాకు అవసరమయ్యే ఎరువులను సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని హోల్‌సెల్ డీలర్లు తమకు కేటాయించిన వివిధ కంపెనీల ఎరువులను వారి పరిధిలోని రిటైల్ డీలర్లందరికీ సమానంగా సరఫరా చేయాలని సూచించారు. అదే విధంగా హోల్‌సెల్ డీలర్లందరు ఎరువుల స్టాక్ వివరాలను గోడౌన్ల యందు పొందుపరచాలని అదే విధంగా వారి వద్దవున్న స్టాక్ వివరాలను సంబంధిత వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు.

# ఎనిమిదేళ్ళ బాలికను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లా పగడాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 8ఏళ్ళు మైనర్ బాలికపై అత్యాచారం చేసిహత్య చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పెద్దకడుబూరు మండల టిడిపి కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న అధ్వర్యంలో వందల సంఖ్యలో వాల్మీకీలు గురువారం పెద్దకడుబూరు మండల కేంద్రంలో స్థానిక వాల్మీకీ విగ్రహం ముందు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్ బాలిక పార్కులో ఆటలు ఆడుతుండగా అధేగ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ వ్యక్తులు కలసి బాలికకు మాయా మాటలు చెప్పి బాలికను ఎత్తికెల్లి అత్యాచారంచేసి హపై హత్య చేసిగ్రామానికి సమీపంలో ఉన్న కాలువలో పడేశారని వారు అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకీలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.సమావేశంలో వాల్మీకి నాయకులు దశరథరాముడు,తలారి అంజి,బాబు,కుంటీఈరన్న, మెట్రుడీలర్ రామాంజనేయులు ఓబులేసు,తదితరులు పాల్గొన్నారు.

# మిడుతూరులో ఉచిత దంత వైద్య శిబిరం



ఉచిత వైద్యం నిర్వహిస్తున్న డాక్టర్ దినేష్ బృందం

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మిడుతూరు మండల కేంద్రంలోని డాక్టర్ ఎం.ఎం. భాష ఆధ్వర్యంలో కర్నూల్ భవిష్య దంత వైద్యశాల నుండి డాక్టర్ దినేష్ బృందం ఆధ్వర్యంలో గురువారం చౌడేశ్వరి దేవాలయం వద్ద ఉచితదంత వైద్య పరీక్షలు మరియు షుగర్, బీపీ టెస్టులు ఉచితంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు డాక్టర్ దినేష్ దంత వైద్య పరీక్షలు నిర్వహించి వారికి వైద్య సహాయం అందించి ఉచిత మందులు పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా డాక్టర్ యం.యం. భాషా మాట్లాడుతూ మానవునికి సోకే అన్ని రోగాలకు దంతాలు కారణమని దంతాలు నురక్షించుకుంటే అన్ని అవయాలు రక్షించుకోవచ్చని అన్నారు. మనిషికి అందం ఎంత ముఖ్యమో దంతాలు అంత ముఖ్యమని అన్నారు. మరియు బీపీ షుగర్ వ్యాధులను ఆజాగ్రత్తగా ఉంటే కొన్ని అవయాలు పాడవుతాయని దీనివల్ల అధిక మూత్రము, బలహీనంగా ఉండటము, నీరసము కళ్ళు తిరగడం అటువంటి లక్షణాలు ఉంటాయని వారు వెంటనే వైద్యలనుసంప్రదించాలని కోరారుషుగర్ ఒక వ్యాధి కాదని,మానసికంగా కృంగిపోకూడదని సరైన మందులు, వ్యాయామం వాకింగ్ చాలా ముఖ్యమని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్ బృందం మరియు ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లు,డాక్టర్ యం.గోపాల్ ఇమ్రాన్ ,షఫీ ,సురేష్ ,అలీ వివిధ గ్రామాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.

# తప్పు జరిగిందని నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటాం

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



**నందికొట్కూరు మేజర్ న్యూస్ :** తప్పు జరిగిందని నిర్ధారణ అయితే కఠిన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా కలెక్టర్ జి . రాజకుమారి అన్నారు .నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజవర్గ పగిడ్యాల మండల పరిధిలోని కొత్త ముచ్చుమర్రి మజారా గ్రామమైన ఎల్లాలకు చెందిన బాలిక ఆచూకీ ఐదు రోజులైనా లభించలేదు. గురువారం సంఘటన స్థలానికి చేరుకున్న నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వివరాలను ఆరా తీశారు .అనంతరం బాలిక తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు ,మీరు అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని బాలిక తల్లిదండ్రులను ఓదార్చారు .అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మైనర్ బాలిక అదృశ్యంపై విచారణ కొనసాగుతోందని,కొందరు అనుమానిత వ్యక్తులను,పిల్లలు అదుపులో తీసుకొని విచారణ చేస్తున్నామని తెలిపారు. తప్పు జరిగిందన్న విషయం మాత్రం నిర్ధారణ అయితే చట్టపరంగా చాలా కఠినంగా వ్యవహరిస్తాం అన్నారు ఎందుకంటే ఇలాంటి విషయాలు పునరావృతం కాకూడదని అందుకు కఠినంగా వ్యవరించాలని అన్నారు.నాలుగు రోజుల నుండి బాలిక కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందంలతో బాలిక ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశామని అన్నారు .అంతేకాకుండా అన్నికోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని తెలియజేసారు.అనంతరం బాలిక ఆడుకోవడానికి వచ్చిన పార్కు ను పరిశీలించారు.

## పెండింగ్ బకాయిలను
# వెంటనే చెల్లించాలి

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్ :** షాపుల బాడుగల పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పత్తికొండ క్రీడల వికాస కేంద్రం అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న షాపులు, గత కొన్నినెలలుగా పెండింగ్‌లో ఉన్నట్టు వంటి షాపులను నోటీసులు ఇప్పించి త్వరగా చెల్లించాలన్నారు. బకాయిలు చెల్లించనియేడలషాపులకు తాళాలు వేస్తామన్నారు. ప్రతి నెల బాడుగ బకాయిలు 5వ తేదిలోపు చెల్లించాలన్నారు. అనంతరం స్టేడియాన్ని ఆయన పరిశీలించారు.



## మైనర్ బాలిక పై అత్యాచారం చేసిన నిందితులను వెంటనే శిక్షించాలి

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్‌:** నంద్యాల జిల్లా పగిడాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన 8 సంవత్సరాల చిన్నారి వాసంతిని ఈ నెల 7వ తేదీన అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ బాలురు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి దేవాదుల పవన్ గోపాల్, జిల్లా నాయకులు గజ్జల పెద్దయ్య కొలిమిగుండ్ల మండల నాయకులతో కలిసి పోలీసు స్టేషన్ వరకు కొవ్వొత్తులతో ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిన్నారి తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల వాల్మీకి మండల నాయకులు, ఉలవల నరసింహులు, కంబగిరిస్వామి, రామ్మూర్తి, మండల సుధాకర్, రాము, దేవనకొండ పెద్దయ్య, వెంకట రమణయ్య, చిన్న నారాయణ హరి, కల్వటాల శేఖర్, అవుకు మండల యూత్ అధ్యక్షులు దయ్యాల నాగమద్దిలేటి, దయ్యాల మహేష్, లారీ మధు, బుడుగు దస్తగిరి, మేకల మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.



సూర్య



## పనిచేయని 435 ఈవీఎంలు

# బెంగుళూరుకు తరలింపు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** సార్వత్రిక ఎన్నికలకు కోసం వచ్చిన ఈవీఎంలలో పనిచేయని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను బెంగుళూరుకు తరలిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. గురువారం టెక్కె మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పనిచేయని ఈవీఎంలను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులైన కాంగ్రెస్ తరపున రియాజ్‌బాషా, బీజేపీ తరపున చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ తరపున శివరాంరెడ్డి, వైసీపీ తరపున సాయిరాంరెడ్డి, సీపీఎం తరపున నరసింహ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా బెంగళూరుబెల్ కంపెనీ నుంచి వచ్చిన ఈవీఎంలలో పనిచేయని ఈవీఎంలను బెంగుళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు. సాంకేతిక లోపం కారణంగా పనిచేయని ఈవీఎంలు, రిజర్వ్‌లో ఉన్న ఈవీఎంలు, ట్రైనింగ్‌లో డిఫెక్ట్ అయిన ఈవీఎంలు, మాక్ పోల్ డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, కమిషనింగ్‌లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు, ఫస్ట్ లెవెల్ చెక్‌లో పనిచేయని బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు మొత్తం కలిపి 345 ఈవీఎంలను గుర్తించామని వీటన్నింటిని స్కాన్ చేసి ఈనెల 22న బెల్ కంపెనీ బెంగుళూరుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కమిషనర్ నిరంజన్‌రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల సమక్షంలో కలెక్టర్ ఆధ్వర్యంలో మూసివేస్తున్న దృశ్యం



రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

# వైద్య చికిత్స ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది

### – జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** విద్యుత్‌ఘాతంతో గాయపడిన విద్యార్థి హుసేని వైద్యచికిత్సకు అయ్యే ఖర్చులను మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష పేర్కొన్నారు. ఆదోని ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఇస్వి గ్రామంలో ఉన్న ఇస్వి–2అంగన్‌వాడి కేంద్రంలో చదువుతున్న హుసేని సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరు తాకడంతో ఎడచేతికి, ఛాతి భాగంలో గాయాలు అయ్యాయని, బాలుడిని వెంటనే ఆదోని ఏరియా ఆసుపత్రికి తర్వాత కర్నూలు జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు. బాలుడి బొటన వేలుకు చిన్నపాటి సర్జరీ జరిగిందని, మిగిలిన భాగంలో చర్మం కాలిపోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన అంగన్‌వాడి హెల్పర్, విద్యుత్‌లైన్‌మెన్, సీడీపీవో, సూపర్‌వైజర్లకు షోకాజ్ మెమో జారీ చేశామన్నారు. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్‌ను చాలా ఎత్తులోకి మార్చడం జరిగిందన్నారు. జిల్లాలోని అన్ని అంగన్ వాడి సెంటర్లకు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల సమాచారం తీసుకున్నామని, వాటికి యుద్ధప్రాతిపదికన కంచ ఏర్పాటు వంటి భద్రత చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష

## వైజాగ్ పర్యటనలో మంత్రి బీసీకి ఘనస్వాగతం

**బనగానపల్లె, మేజర్‌న్యూస్:** సి.ఎం చంద్రబాబు భోగాపురం విమానాశ్రయం నిర్మాణ సమావేశం నిమిత్తం వైజాగ్ విచ్చేసిన రాష్ట్ర మంత్రి వర్యులు బీసీ జనార్ధన్ రెడ్డికి విజయనగరం జిల్లా రోడ్డు భవనాల శాఖా అధికారులు నందు ఐటీ హిల్స్ 3లో బిపిఎంఎల్ డేటా సెంటర్‌ను మంత్రి బీసీ పరిశీలించారు. ఆంధ్రా యూనివర్శిటి ఎపీ ఫైబర్ డేటా సెంటర్‌ను మంత్రి బీసీ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు వారికి బోకేలతో స్వాగతం పలికారు.


మంత్రి బీసీకి బొకే అందజేస్తున్న దృశ్యం

## భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ పనుల సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి బీసీ

**బనగానపల్లె, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను సి.ఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలిసి పరిశీలించిన రాష్ట్ర రోడ్డు భవనాల శాఖా మాత్యులు బీసీ జనార్ధన్ రెడ్డి అనంతరం ఎవియేషన్ అధికారులు ఈ.ఎం.ఆర్ సంస్థ ప్రతినిధులతో నిర్మాణ పనుల పురోగతిపై చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల కల్పన తదితర వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, జి.ఎం.ఆర్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


చంద్రబాబును కలిసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

## నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

### డోన్ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ప్యాపిలి సర్కిల్ పరిధిలోని బాధితుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డోన్ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ప్యాపిలి పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి, పోలీసుస్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సిఐ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డోన్ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి

## ప్రజలకు చౌక ధరలకే

# రేషన్, కందిపప్పు పంపిణీ

◆ డోన్ ఎమ్మెల్యే కోట్ల


తక్కువ ధరకు సన్న బియ్యాన్ని మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల


నిత్యవసరాల దుకాణం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల, అధికారులు, నాయకులు

**డోన్, మేజర్‌న్యూస్:** పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్ నందు కూరగాయల కాంప్లెక్స్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాలనుసారం నిత్యవసర సరుకుల ధరలను తగ్గించి మార్కెట్ రేట్ కంటే చౌక ధరలకు రేషన్, కందిపప్పు అందిస్తున్నట్లు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ప్రజలకు తెలిపారు. గురువారం స్థానిక కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన నిత్యవసర సరుకుల దుకాణాన్ని ఎమ్మెల్యే కోట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బడుగు, బలహీన వర్గాలకు సంబందించిన నిరుపేదలు ఆధార్‌కార్డులు కలిగి ఉండి, తక్కువ ధరలకే కందిపప్పు, సన్న బియ్యం అందించేందుకు చర్యలు తీసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. రాబోయే టిడిపి ప్రభుత్వంలో అనేక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకుంటారని పేర్కొన్నారు. డోన్ నియోజకవర్గంలో ప్రతిపేద కుటుంబానికి కోట్ల కుటుంబం అండగా నిలిచి, సంక్షేమ పథకాలను నేరుగా ఇంటింటికి అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావుయాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ టిఈ.కేశన్నగౌడ్, బీజేపి నాయకులు వడ్డె మహరాజ్, జనసేన నాయకులు ఆలా మోహన్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, పౌరసరఫరాశాఖ అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చదువుతోనే బంగారు భవిష్యత్తు

### – కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్:** చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం కర్నూలు నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. కాలేజీలో కల్పిస్తున్న సౌకర్యాలను, విద్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. తాను ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే చదువుకున్నానని, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదువుకోవడాన్ని చిన్నచూపుగా చూసుకోకూడదన్నారు. ఇక కళాశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎంపీ నిధులతో కళాశాలను అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. అంతకుముందు కళాశాల సిబ్బంది ఎంపీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లాలెప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు సన్మానిస్తున్న దృశ్యం